క్లుప్తంగా

ఆశవర్కర్లకు రాత పరీక్ష రద్దు చేయాలి



వైద్యురాలు ప్రత్యూషకు వినతిపత్రం ఇస్తున్న ఆశవర్కర్లు

లక్ష్మణచాంద: రాష్ట్ర ప్రభుత్వం ఆశవర్కర్లకు నిర్వహిస్తున్న రాత పరీక్ష రద్దు చేయాలని సోమవారం స్థానిక పీహెచ్‌సీ వైద్యురాలు ప్రత్యూషకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల ఆశవర్కర్ల అధ్యక్షురాలు విజయ మాట్లాడుతూ ఆశవర్కర్లకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని కోరారు. పెండింగ్ బిల్లులు అందించాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనం రూ.18 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆశవర్కర్లు ఆడెపు శారద, రత్నమాల, భూదేవి, వనిత, సునీత, పుష్ప, నవనీత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వైష్ణవ అపర ఏకాదశి



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

లోకేశ్వరం: మండలంలోని బాగాపూర్ లక్ష్మీ నారాయణస్వామి ఆలయంలో వైష్ణవ అపర ఏకాదశిని సోమవారం ఘనంగా నిర్వహించారు. అర్చకుడు నరసింహస్వామి ఆధ్వర్యంలో భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మొక్కు చెల్లించుకున్నారు.

అందుబాటులో విత్తనాలు

ముధోల్: రైతులకు విత్తనాలు అందుబాటులో ఉన్నాయని పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్‌గౌడ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో ముధోల్, బాసర, బోరేగావ్ గోదాంలలో డీఏపీ ఉందని తెలిపారు. ముధోల్, బోరేగావ్, బాసర, కారేగావ్, చింతకుంట గ్రామాల్లోని గోదాంలలో గ్రోమోర్ 20:20:20:0:13, బాసర, ముధోల్ సూపర్(ఎస్ఎస్‌పీ) అందుబాటులో ఉన్నాయని కావాల్సిన రైతులు ఆధార్‌కార్డు తీసుకురావాలని సూచించారు. డీఏపీ రూ.1350, 20:20:20:0:13 రూ.1100, 15:15:15 రూ.1350, ఎస్ఎస్‌పీ సూపర్ రూ.550, జేఎస్ 3335 సోయా రూ.2100గా ఉందని పేర్కొన్నారు.

తానూరు: మండల కేంద్రంలోని హంగిర్గా సొసైటీ కార్యాలయంలో కృష్ణ సీడ్ సోయా జేఎస్ 335 విత్తనాల బ్యాగులు అందుబాటులో ఉన్నట్లు సీఈవో భూమయ్య ఓ ప్రకటనలో తెలిపారు. 30 కేజీల బ్యాగ్ ధర రూ.2,100 ఉందని పేర్కొన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు పట్టా పాసుపుస్తకంతో వచ్చి విత్తనాలు పొందాలని సూచించారు.

పాఠశాలల్లో మరమ్మతు పూర్తి చేయాలి



ధర్మోరలోని మరుగుదొడ్డిని పరిశీలిస్తున్న ఎంపీడీవో

లోకేశ్వరం: అమ్మ ఆదర్శ పాఠశాలల కింద సర్కారు బడుల్లో మరమ్మతు పనులు పూర్తిచేయాలని ఎంపీడీవో సోలమాన్ రాజ్ అన్నారు. మండలంలోని బామ్నికే, పంచగుడి, ధర్మోర గ్రామాల్లోని పాఠశాలల పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభంలోగా పనులు పూర్తి చేయాలన్నారు. నర్సరీలో మొక్కలకు నీరందించాలన్నారు. కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ముగిసిన ధాన్యం కొనుగోళ్లు



ధాన్యాన్ని తరలిస్తున్న నిర్వాహకులు

ఖానాపూర్: మండలంలోని సత్తన్‌పల్లి పీఏసీఎస్ ఆధ్వర్యంలో సత్తన్‌పల్లితోపాటు పాత ఎల్లాపూర్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కేంద్రాల్లో కొనుగోళ్లు సోమవారంతో ముగిశాయి. ఇప్పటి వరకు సత్తన్‌పల్లిలో 315 మంది రైతుల నుంచి 23465 బస్తాలు, పాత ఎల్లాపూర్‌లో 526 మంది నుంచి 46686 ధాన్యం బస్తాలు కొనుగోలు చేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. 99 శాతం ధాన్యం తరలించామని, ఇంకా కొన్ని తరలించాల్సి ఉందని తెలిపారు.

ప్రమాదం అంచున ప్రయాణం

- రోడ్ల పక్కనే భారీ వృక్షాలు
- ఎప్పుడేం ప్రమాదం జరుగుతుందోనని ప్రజల ఆందోళన



పీచర చెరువు రోడ్డుపై ఉన్న భారీ వృక్షం

లక్ష్మణచాంద: మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే ప్రధాన రోడ్ల పక్కన ఉన్న భారీ వృక్షాలు వర్షాకాలంలో వీచే ఈదురుగాలులకు విరిగే ప్రమాదం లేకపోలేదు. ఆ దారి గుండా వెళ్లే వాహనదారులు, పాదచారులు ప్రమాదం అంచున ప్రయాణం సాగించాల్సిన పరిస్థితి. కనకాపూర్ బస్టాండ్ సమీపంలో భారీ వృక్షం ఉంది. దీని కొమ్మలు రోడ్డుపై చేరింది. రాచాపూర్-పీచర గ్రామాల మధ్యన రెండు చోట్ల పెద్ద వృక్షాలు రోడ్డు పక్కనే ప్రమాదకరంగా ఉన్నాయి. పీచర-ధర్మారం గ్రామాల మధ్యన చెరువుపై గల రోడ్డు వద్ద పెద్ద వృక్షం ఉంది. ధర్మారం-మల్లాపూర్ గ్రామాల మధ్యన పలుచోట్ల భారీ వృక్షాలు ఉండి ప్రమాదకరంగా ఉన్నాయి. రాచాపూర్-మూటాపూర్ గ్రామాల మధ్యన రహదారిపై పలుచోట్ల భారీ వృక్షాలు ఉన్నాయి. లక్ష్మణచాంద సమీపంలో పలుచోట్ల భారీ వృక్షాలు రోడ్డుపైకి కొమ్మలు వచ్చి ప్రమాదకరంగా మారాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చెట్లకొమ్మలు తొలగించేలా చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు.

చెట్లకొమ్మలు తొలగించాలి



గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారుల వెంట భారీ వృక్షాలు పెరిగాయి. కొమ్మలు రోడ్డుపై చేరాయి. ఎప్పుడేం ప్రమాదం జరుగుతుందోనని భయంగా ఉంది. చెట్ల కొమ్మలు తొలగించాలి.

– శివన్న, న్యూకంజర్

ఇబ్బంది లేకుండా చూడాలి



గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారుల వెంబడి భారీ వృక్షాలు ఉన్నాయి. రోడ్డుపై అవి వచ్చి చేరాయి. అధికారులు వాటిని తొలగించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలి.

– ముత్యం, పీచర



లక్ష్మణచాంద సమీపంలో ఉన్న భారీ వృక్షం



మల్లాపూర్ సమీపంలో రోడ్డు పక్కనే ఉన్న వేపచెట్టు



రాచాపూర్ సమీపంలో రోడ్డుపైకి వచ్చిన వృక్షం

బాధిత కుటుంబాలకు పరామర్శ

భైంసారూరల్: మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన కత్తి సంతోశ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఎమ్మెల్యే రామారావుపటేల్ బాధిత కుటుంబాన్ని సోమవారం పరామర్శించారు. ఆయన వెంట ఎంపీపీ అబ్దుల్ రజాక్, ఎంపీటీసీ అశోక్, నాయకులు చిన్నన్న, రామారావు, తదితరులు ఉన్నారు.



భైంసారూరల్: పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రామారావుపటేల్

కుంటాల: మండలంలోని ఓలా గ్రామానికి చెందిన మాజీమంత్రి ఐకేరెడ్డి పీఏ నాళం శ్రీనివాస్, నాళం మదన్‌మోహన్ తల్లి భోజవ్వ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. సోమవారం బాధిత కుటుంబాన్ని మాజీమంత్రి ఐకేరెడ్డితోపాటు పలువురు నాయకులు వేర్వేరుగా పరామర్శించారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, మాజీ ఎమ్మెల్యేలు విఠల్‌రెడ్డి, రాథోడ్ బాపురావు, ప్రముఖ వ్యాపారవేత్త అల్లోల మురళీధర్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్లు జుట్టు అశోక్, లోలం శ్యాంసుందర్, రాంకిషన్‌రెడ్డి, భూషణ్‌రెడ్డి, సుభాష్‌రావు, పత్తి రాజేశ్వర్‌రెడ్డి, ప్రముఖ న్యాయవాది మల్లారెడ్డి, పాకాల రాంచందర్, అమరవేణి నర్సాగౌడ్, కొత్తపల్లి బుచ్చన్న తదితరులు ఉన్నారు.

ఖానాపూర్: పట్టణంలోని బీఆర్ఎస్ క్యాంపు కార్యాలయంలో సహాయకులుగా పనిచేసే నరేశ్, సురేందర్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. బీర్నంది పంచాయతీ పరిధిలోని కొమ్ముతండా గ్రామానికి చెందిన బాధితుల నివాసానికి వెళ్లి బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్‌నాయక్ పరామర్శించారు. అధైర్యపడవద్దని, అండగా ఉంటానని తెలిపారు.



బాతుల కోలాహలం

లక్ష్మణచాంద: మండలంలోని ధర్మారం సమీపంలోని చెరువు వద్ద బాతులతో కోలాహలంగా మారింది. వేసవిలో ఆంధ్రప్రదేశ్ నుంచి ఒకరు బాతులను ధర్మారానికి మేత కోసం తీసుకువచ్చాడు. వందల సంఖ్యలో అవి చెరువులో అటు ఇటు తిరుగుతూ కనిపించాయి.

విత్తనాల కోసం బారులు



టోకెన్ల కోసం వచ్చిన రైతులు

ఖానాపూర్: మండలంలోని సత్తనపల్లి పీఏసీఎస్ ఆధ్వర్యంలో విక్రయిస్తున్న జీలుగ విత్తనాల కోసం సోమవారం రైతులు బారులు తీరారు. రెండు రోజుల క్రితం 100 క్వింటాళ్ల విత్తనాలు రావడంతో తీసుకెళ్లేందుకు తరలివచ్చారు. అక్కడికి వచ్చిన రైతులకు రైతు వేదికలో వ్యవసాయ అధికారులు టోకెన్లు అందజేశారు. వారు పీఏసీఎస్ కేంద్రానికి విత్తనాల కోసం తరలివచ్చి తీసుకెళ్లారు.



పీఏసీఎస్ కేంద్రానికి వచ్చిన రైతులు

కోతకు గురైన రోడ్లు



ఇలేగాం-ఉమ్రి(కే) దారిలో కల్వర్టు వద్ద కోతకు గురైన రోడ్డు

- గ్రామాల్లో కల్వర్టులు కూడా..
- రాకపోకలకు అంతరాయం
- ఇబ్బందుల్లో ప్రజలు
- పట్టించుకోని అధికారులు

తానూరు: మండలంలోని గ్రామాలకు వెళ్లేదారిలో కల్వర్టుల వద్ద రోడ్లు కోతకు గురయ్యాయి. గతేడాది కురిసిన భారీ వర్షాలకు ఎల్వత్, వడవన, ఉమ్రి(కే), దాగాం, దౌలతాబద్ గ్రామాల్లో బీటీ రోడ్లు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. రాకపోకలు సాగించే ప్రజలు, వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పుడేం ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. తానూరు-ముథోల్ నుంచి ఎల్వత్ గ్రామానికి వెళ్లేదారిలో కల్వర్టు వద్ద రోడ్డు కోతకు గురైంది. ఇలేగాం-ఉమ్రి(కే) గ్రామాలకు ఉన్న రహదారిలో మూడుచోట్ల కల్వర్టు వద్ద పెద్ద గుంత ఏర్పడింది. తానూరు శివారు ప్రాంతంలో గుంత ఏర్పడడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. వాడవన సమీపంలోని వంతెన వద్ద రోడ్డు కోతకు గురికావడంతో ప్రయాణికులు పాట్లు పడుతున్నారు. రాత్రి సమయంలో ద్విచక్రవాహనదారులు గుంతల్లో పడి గాయాలపాలవుతున్నారు. గత మూడు నెలల క్రితం ఎల్వత్ రోడ్డుకు ఉన్న గుంత తెలియక ధర్మాబాద్‌కు చెందిన వాహనదారుడు ప్రమాదానికి గురయ్యాడు. అయినా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.



దాగాం సమీపంలో కోతకు గురైన రోడ్డు

మరమ్మతు చేపట్టాలి



ఇలేగాం నుంచి ఉమ్రి(కే) గ్రామానికి ఉన్న దారిలో మూడుచోట్ల కల్వర్టుల వద్ద భారీ వర్షాలకు రోడ్డు కోతకు గురైంది. ప్రయాణం చేయాలంటే భయమేస్తుంది. కోతకు గురైన కల్వర్టులు, రోడ్లకు వెంటనే మరమ్మతు చేపట్టాలి.

– లక్ష్మణ్, ఉమ్రి(కే)

సమస్యలు పరిష్కరిస్తాం

గ్రామాల్లో కోతకు గురైన కల్వర్టుల మరమ్మతుకు నిధుల కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైతే మరమ్మతు చేపడుతాం. వాడవన గ్రామ సమీపంలో కోతకు గురైన కల్వర్టు మరమ్మతుకు నిధులు విడుదలయ్యాయి. సత్వరమే పనులు చేపడుతాం.

– కమలాకర్, పీఆర్ డీఈ

సృజనాత్మకత వెలికితీతకు శిక్షణ తరగతులు



శిక్షణ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

కుంటాల: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు వేసవి శిక్షణ తరగతులు దోహదపడతాయని హెచ్ఎం సక్రపు గజేందర్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో రూమ్ టు రీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ తరగతులు నిర్వహించిన అనంతరం మాట్లాడారు. ప్రత్యేక బోధన ద్వారా విద్యార్థుల్లో విషయ పరిజ్ఞానం పెరుగుతుందన్నారు. రూమ్ టు రీడ్ స్వచ్ఛంద సంస్థ ఏరియా కోఆర్డినేటర్ అడ్డిగ రాము, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో సమస్యలు పరిష్కరిస్తాం



పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్

ఖానాపూర్: పట్టణంలోని బస్టాండ్ సమీపంలోని పాఠశాల భవనంలో కొనసాగుతున్న గ్రంథాలయంలోని సమస్యలను పరిష్కరిస్తామని మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం అన్నారు. పట్టణంలోని గ్రంథాలయాన్ని సోమవారం సందర్శించారు. పరీక్షలకు సన్నద్ధమవుతున్న నిరుద్యోగులు, పాఠకులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. తాగునీటి వసతి, పారిశుధ్య లోపం ఇతర సమస్యలను పరిష్కరిస్తానని హామీఇచ్చారు. మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ప్రభుత్వాస్పత్రి సందర్శన

కడెం: స్థానిక ప్రభుత్వాస్పత్రిని సోమవారం సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి సునారికారి రాజేష్ సందర్శించారు. రెగ్యులర్ డాక్టర్ శివకుమార్ కొన్నినెలలుగా ఆస్పత్రికి రాకపోవడంతో సిబ్బంది ఓపీ చూస్తున్నారని తెలిపారు. కలెక్టర్ స్పందించి వైద్యుడిపై చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు దుర్గం లింగన్న ఆకుల సత్తన్న తదితరులు ఉన్నారు.

'అభివృద్ధిని ఓర్వలేక ప్రతిపక్షాల దుష్ప్రచారం'

భైంసాటౌన్: ఎమ్మెల్యే రామారావుపటేల్ నేతృత్వంలో నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని ఓర్వలేకనే ప్రతిపక్షాలు దుష్ప్రచారానికి తెగబడ్డాయని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ తాడేవార్ సాయినాథ్ ఆరోపించారు. ఎమ్మెల్యే, కార్యకర్తకు మధ్య జరిగిన సంభాషణ సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంపై ఈమేరకు స్పందిస్తూ సోమవారం ఎస్ఎస్ ఫ్యాక్టరీలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఆడియో వెనుక ప్రతిపక్షాల కుట్ర ఉందని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి వందరోజుల్లో రూ.140 కోట్లు మంజూరు చేయడంతో, ఓర్వ లేనితనంతో కావాలనే ఆయన ప్రతిష్టను దిగజార్చే యత్నం చేస్తున్నారన్నారు. పార్టీ కార్యకర్తలు క్రమశిక్షణ ఉల్లంఘనకు పాల్పడితే చర్యలు ఉంటాయన్నారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు మల్లేశ్వర్, కౌన్సిలర్లు గౌతం పింగ్లే, దశరథ్, కపిల్‌సింధే, నాయకులు రావుల పోశెట్టి, సాహెబ్ రావు, పట్టణ కమిటీ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ సాయినాథ్, పట్టణ కమిటీ నాయకులు

అమ్మవారికి సారె సమర్పణ

ఖానాపూర్: మండలంలోని తర్లపాడ్ గ్రామంలోని ఓంకారేశ్వర ఆలయంలో పార్వతి దేవి అమ్మవారికి సోమవారం మహిళలు సారెను సమర్పించారు. పట్టణంలోని శ్రీశైవక్షేత్ర వనితాశక్తి ఆధ్వర్యంలో ›మనసారె మనసారా మన అమ్మకు‹కార్యక్రమంలో భాగంగా అర్చకులు హరీశ్ ఆధ్వర్యంలో పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి చీరె, సారెను సమర్పించారు. జితేందర్, మాధవి, వాసవి, సరిత, గీతారాణి, రాధిక, మానస, ప్రవంతి తదితరులు ఉన్నారు.



సారెను సమర్పిస్తున్న మహిళలు

పూడిక తీత పనులు పరిశీలన

నిర్మల్‌టౌన్: వర్షాకాలం దృష్టిలో పెట్టుకుని పట్టణంలోని పలు వార్డుల్లో సోమవారం పారిశుధ్య కార్మికులు వరద నీటి కాలువలోని గుర్రపు డెక్కలు, చెట్ల పొదలు, పిచ్చిమొక్కలను తొలగించారు. నీటి ప్రవాహానికి అడ్డుగా ఉండే పూడికతీతను పనులను మున్సిపల్ కమిషనర్ రాజు పరిశీలించారు.

పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రాజు ➤



గుంత పూడ్చివేత

సాక్షి స్పందన

కుభీర్: మండల కేంద్రంలోని మహాలక్ష్మి మందిరం ముందు మిషన్ భగీరథ కోసం తవ్విన గుంత రెండు నెలలైనా పూడ్చలేదు. అటెన్షన్ ప్లీజ్‌లో 'ప్రమాదకరంగా గుంత పూడ్చరు' శీర్షికన గతనెల 30న సాక్షిలో కథనానికి ప్రచురితమైంది. దీనికి స్పందించిన అధికారులు ఏఈ రాజన్న, పంచాయతీ ఈవో విజయ్ సోమవారం దగ్గరుండి జీకేజీకి మరమ్మతు చేసి గుంతను పూడ్చివేశారు.



అటెన్షన్ ప్లీజ్ విద్యుత్ తీగలు సరిచేయరూ

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని 61వ జాతీయ రహదారి, ఓ రైతు పొలం పక్కన విద్యుత్ తీగలు కిందికి వేలాడుతూ చేతికందే ఎత్తులో ప్రమాదకరంగా ఉన్నాయి.



వీచే గాలులకు పక్కనే ఉన్న చెట్లకొమ్మలు తీగలు తగిలి ఎప్పుడేం ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ప్రమాదం జరగక ముందే అధికారులు విద్యుత్ తీగలను సరిచేసేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: శ్రీనివాస్, ఏఈ, నర్సాపూర్ (జి)
ఫోన్: 9440814879